

పిఠాపురంలో కనుల పండువగా కుంతీమాధవుని రథోత్సవం 8

అన్నవరంలో వాట్సాప్ ద్వారా వ్రతాలు, దర్శన సేవలు 7





నిన్నటివరకూ కళకళ..నేడు వెలవెల

బర్డ్ ఫ్లూ సోకిన ఫారం వద్ద అధికారుల పరిశీలన

కోడికి.. కష్టమొచ్చింది!

బర్డ్ ఫ్లూ వైరస్.. భయం..భయం



కానూరులో డీఎంహెచ్‌వో పరిశీలన

వండిన చికెన్ మాత్రమే తినాలి

చికెన్ తింటే.. 75 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ వండినది మాత్రమే తీసుకోవాలి. పచ్చిమాంసం తినకూడదు. హాఫ్ బాయిల్డ్ గుడ్లు తినకూడదు. కోడ్లు, మాంసం చేతితో తాకిన తర్వాత శుభ్రంగా కడుక్కోవాలి. గుడ్లు, చికెన్ వేర్వేరుగా ఉంచాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు. ముడి చికెన్, కోడిగుడ్లు తాకిన ఉపకరణాలను బాగా శుభ్రం చేయాలి. కోళ్లు మరణించి ఉంటే వాటిని జాగ్రత్తగా నిర్మూలన చేయాలి. రవాణా చేసే డబ్బాలు తరచూ శుభ్రం చేయాలి. తూర్పు గోదావరి జిల్లాలో ఎవరికైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి చెప్పాలి.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో, తూర్పుగోదావరి

కోడికి కష్టమొచ్చింది.. వైరస్ దెబ్బకు ఓడిపోయింది.. కోడిని చూస్తేనే జనం పరుగుపెడుతున్నారు.. రెండు రోజుల కిందట వరకూ కోడిని చూసి లొట్టలేసిన వారు.. ప్రస్తుతం చికెన్ తినాలా! వద్దా!.. అనే మీమాంసలో పడిపోయారు.. ఎందుకంటే బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. తినకపోవడమే మంచిదనే అభిప్రాయంలో జనం ఉన్నారు.. దీంతో మంగళవారం చికెన్ దుకాణాలు వెల వెలబోయాయి.. పౌల్ట్రీ రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.. ఉభయగోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ యజమానులు లబోదిబో మంటున్నారు.. అయితే యానిమల్ హజ్బెండరీ అధికారులు మాత్రం ఉడకబెట్టిన తరువాత చికెన్ తిన్నా ఇబ్బందేంలేదని చెబుతున్నారు.. గతంలోనూ ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వచ్చింది.. అప్పుడు ఎవరికైనా సోకిందా అని ప్రశ్నిస్తున్నారు.. దీంతో పచ్చిమాంసం తింటే ప్రమాదమే కానీ.. ఉడకబెట్టిన తరువాత తింటే ప్రమాదమేం లేదనేది చాలామంది వాదన..

తూర్పున అప్రమత్తం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కానూరు అగ్రహారంలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేశారు. వాస్తవానికి జనవరి నుంచే ఇక్కడ కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు. సుమారు 54 వేల కోళ్లు మృతిచెందిన తర్వాత పౌల్ట్రీ యజమాని జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు శాంపిల్స్ తీసి పరీక్షించడంతో బర్డ్‌ఫ్లూ బయటపడింది. ఇప్పటి వరకూ మొత్తం 84 వేల కోళ్లు ఇక్కడ మృతి చెందినట్టు ఓ అధికారి తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది మిగిలిన 2,976 కోళ్లకు మత్తు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. గ్రామ ప్రజలు పెంచుకుంటున్న సుమారు 45 కోళ్లను కూడా స్వాధీనం చేసుకుని, వాటిని కూడా పూడ్చిపెట్టారు. ఈ గ్రామంలో 2700 మంది జనాభా ఉన్నారు. మూడు ప్రధాన కోళ్ల ఫారాలతోపాటు మరో ఆరు వరకూ ఫారాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఇక్కడ దృష్టి కేంద్రీకరించింది. వైద్యశాఖ అధికారులు ప్రతి మనిషి నుంచి శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. ఊరిలో ఎవరూ కోడి మాంసం, గుడ్లు తినవద్దని టాంటాం వేసినట్టు సర్పంచ్ దాసం వెంకన్న తెలిపారు. కిలో మీటరు లోపు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఇక్కడ అందరూ అప్రమత్తంగా ఉండేటట్టు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కోళ్లఫారాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు.



అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నిడదవోలు నియోజకవర్గం పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలోని 34 గ్రామాల్లో ఇంటింటికీ సర్వే చేసి బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాల ఎవరికైనా ఉన్నాయేమో అనే సర్వే చేయడం కోసం 64 వైద్య బృందాలను నియమించాం. సీతానగరం మండలంలో కూడా సర్వే చేయిన్నాం. ఇతర యానిమల్స్‌కు వైరస్ సోకకుండా వాక్సినేషన్ చేయిస్తున్నాం. అపోహలు వద్దు, జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, ఇంతవరకూ జిల్లాలో మనుషులెవరికి ఈ వ్యాధి సోకినట్టు దాఖలాలు లేవు. కానూరు నుంచి కోళ్లు, గుడ్లు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ కానూరులో పర్యటించారు.

- మూడు జిల్లాలపై తీవ్ర ప్రభావం
- పడిపోయిన అమ్మకాలు
- ఒక్కసారిగా దిగజారిన గుడ్డు ధర
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ రైతులు
- అప్రమత్తమైన అధికారులు
- ఎక్కడికక్కడ కట్టడికి చర్యలు
- కాకినాడలో ర్యాపిడ్ టీమ్‌లు
- పచ్చి మాంసం తింటేనే ప్రమాదం
- ఆఫ్ బాయిల్డ్ ఎగ్ తినకూడదు
- ఉడకబెడితే తినొచ్చంటున్న వైద్యులు

కోనసీమలో ఆనవాళ్లు లేవు : కలెక్టర్

కోనసీమ జిల్లాలోని 18 పౌల్ట్రీల్లో 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయి.. ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లను గుర్తించలేదు.. పక్క జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్న దృష్ట్యా పౌల్ట్రీ యజమానులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. వారం రోజులపాటు జిల్లాలో అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా నిలిపివేయాలి. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో బర్డ్ ఫ్లూపై సమీక్షించి పలు సూచనలు చేశారు.



కోనసీమలో వైరస్ లేదు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ ప్రచారంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిధిలో ఎక్కడా బర్డ్ ఫ్లూ ప్రభావం లేనప్పటికీ ప్రచార ప్రభావంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాంతో కోళ్ల ఆధారంగా నడిచే నాన్‌వెజ్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్ వినియోగం తగ్గుముఖం పట్టింది. చికెన్ దుకాణాలపై ఈ ప్రభావం పడి అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లావ్యాప్తంగా మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల పరిధితోపాటు వివిధ ప్రాంతాల్లో 57 లక్షలకుపైగా కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు పశు సంవర్థకశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడం వల్లే కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కోనసీమ జిల్లాలో కోళ్లకు వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఆ తరహా వ్యాధిలేమీ సోకలేదనేది అధికారుల వాదన. ఒక కోడికి వేసే వ్యాక్సిన్ ఖర్చు రూ.2 నుంచి రూ.10 అవుతుంది. దీంతో కొందరు వ్యాక్సినేషన్ వేయకపోవడంతో ఈ తరహా వైరస్ సోకుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌల్ట్రీ సంఘ యజమానులు మాత్రం కోనసీమ జిల్లాలో ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని.. చికెన్ వినియోగించవచ్చని ప్రచారం చేస్తున్నారు.

కాకినాడలో అలెర్ట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పశుసంవర్థక శాఖ అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఈ మేరకు ప్రతి మండలానికి రెండు చొప్పున ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా సచివాలయాల్లో పనిచేసే పశుసంవర్థక శాఖ సిబ్బందిని భాగస్వామ్యం చేసింది. ఈ బృందాలు మంగళవారం నుంచి గ్రామాల్లో కోళ్లఫారాలను తనిఖీ చేయించింది. ఎక్కడైనా కోళ్లు మృత్యువాత పడినట్టు గుర్తిస్తే తక్షణం ఆ ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో మంగళవారం మొత్తం 42 బృందాలు కోళ్లఫారాలను పరిశీలించాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 82 కోళ్ల ఫారాల్లో 62 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో కోళ్లు మృతి చెందినట్టు గుర్తిస్తే ఆయా ఫారాల యాజమాన్యాలు తక్షణం సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్థకశాఖ ఆదేశించింది. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతుండడంతో ఎక్కడికక్కడ ప్రజల్లో అవగాహన వచ్చేలా చైతన్యం చేయాలని అధికారులు ఆదేశించారు.



కానూరులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

కాకినాడ జిల్లాలో అంగన్‌వాడీల గుడ్డుకు ఓకే



కాకినాడ జిల్లాలో స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న గుడ్లను చిన్నారులకు తినిపించవచ్చా లేదా అనే దానిపై ఆ శాఖ అధికారులు మంగళవారం విషయాన్ని పశుసంవర్థకశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉడికించిన గుడ్లను తినడం వల్ల ఎలాంటి వైరస్ ముప్పు ఉండదని స్పష్టం చేయడంతో ఈ జిల్లాలో అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా యధాతథం చేశారు. బర్డ్‌ఫ్లూ ఆందోళనల నేపథ్యంలో మంగళవారం గుడ్డు ధర పతనమైంది.

గుడ్డు.. బ్యాడ్

బర్డ్‌ఫ్లూ ప్రభావం కోళ్ల పెంపకందార్లను కొంత దెబ్బకొట్టింది. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రభావం నుంచి బయటపడతామని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు. గుడ్ల పరిశ్రమకు సంబంధించి ఒక్కొక్క గుడ్డు రైతు ధర సోమవారం రూ.4.25 వరకు ఉండగా మంగళవారం రూ.3.95కి తగ్గించి ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఒకేరోజు 30 పైసలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కిలో రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయాలు సాగిన బాయిలర్‌కు కోడిమాంసం ఒక్కసారిగా రూ.180కి పడిపోయింది. కొన్నిచోట్ల కొనేవారు లేక చికెన్ దుకాణాలు తెరవలేదు.

ఎండలొచ్చేశాయి.. వైరస్‌తో ఇబ్బంది ఉండదు..

ప్రస్తుతం కొద్దిచోట్ల మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉంది. గోదావరి జిల్లాల్లో ఇతర ప్రాంతాలన్నీ బాగానే ఉన్నాయి. చలికాలంలో మాత్రమే వైరస్ ప్రబలి కోళ్లు చనిపోతాయి. ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి కాబట్టి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టమేమీ ఉండదు.

- పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ సెక్రటరీ

ఉడికించిన తరువాత తింటే ఏం కాదు..

బాగా ఉడికించిన తరువాత చికెన్, గుడ్లు తింటే వైరస్ ప్రభావం ఉండదు. ఈ రంగంపై అపోహలు తొలగేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. వైరస్ కారణంగా కొన్నిచోట్ల జరిగిన పొరపాట్లకు మొత్తం పరిశ్రమ నష్టపోయే పరిస్థితి సరికాదు. **- మేకా శ్రీనివాస్, పౌల్ట్రీ యజమాని, మండపేట**

మస్తర్ల అక్రమాలపై ఉక్కుపాదం

రూ.2 లక్షల 72 వేలు రికవరీకి ఆదేశం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మస్తర్ల అక్రమాలపై జిల్లా అధికారులు ఉక్కుపాదం మోపారు. పిఠాపురం, కోటనందూరు మండలాల్లో మస్తర్ల అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.2 లక్షల 72 వేలు రికవరీ చేయాలని సోషల్ ఆడిట్ అధికారులు ఆదేశించారు. దీనిలో పిఠాపురం మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.1,56,400 రికవరీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అలాగే కోటనందూరు మండలంలో మస్తర్లలో జరిగిన తప్పిదాలకు రూ.1,16,000 రికవరీ చేయాలని ఆదేశించారు. 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కొలతల్లో తేడాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపు, మస్తర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలను గుర్తించారు. దీంతో రెండు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.2 లక్షల 72 వేలు రికవరీ కింద వసూలు చేయాలని సోషల్ ఆడిట్ అధికారులు ఆదేశించారు. ఇక నుంచి తనిఖీ బృందం తొండంగి, తుని మండలా ల్లో ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తుంది. ఈ ప్రక్రియ 15 రోజులు పడుతుందని డ్వామా పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆక్టోపస్ నుంచి బదిలీపై కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగేంద్రరావు మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నేడు జరుగుతున్న అనేక సైబర్ నేరాలను కొద్దిపాటి అప్రమత్తత పాటించడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా మన కుటుంబాన్ని కూడా కాపాడుకోవచ్చని ఎన్ఐసీ జిల్లా ఇన్ఫర్మాటిక్ అధికారి సుబ్బారావు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ ఆధ్వర్యంలో సురక్షితమైన ఇంటర్‌నెట్ దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకి పెరిగిపోతున్న సైబర్ నేరాల విషయంలో ప్రజలందరూ ఇంటర్నెట్ వినియోగంలో కొద్దిపాటి అప్రమత్తత పాటించడం ద్వారా మన సమాచారాన్ని వేరొకరికి చేరకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. తద్వారా మనల్ని మనం ఈ సైబర్ నేరగాళ్ల ఉచ్చు నుంచి కాపాడుకోవడమే కాకుండా మన కుటుంబాన్ని కాపాడుకోవచ్చన్నారు. భారత ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ 'టుగెదర్ ఫర్ బెటర్ ఇంటర్నెట్' అనే నినాదంతో ఏటా ఫిబ్రవరి రెండో మంగళవారాన్ని ఇంటర్నెట్ సేఫ్ డేగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు తమ ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు, బయోమెట్రిక్స్ వంటివి ఎవరికైనా ఇచ్చే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బజార్ల బెంగ తీరినట్టే!

- జిల్లాలో కొత్త రైతుబజార్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా
- తొలుత మున్సిపాల్టీల్లో నిర్మించాలని మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు
- సామర్లకోట, తుని, పిఠాపురం, కాకినాడలలో తీరనున్న బజార్ల సమస్య
- నిధుల్లేక మధ్యలో నిలిచిపోయినవాటినీ ప్రారంభించేలా కసరత్తు
- కోడ్ ముగిశాక తూరంగి రైతుబజారును ప్రారంభించనున్న అధికారులు

జిల్లాలో కొత్త రైతుబజార్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తొలి దశలో మున్సిపాల్టీల పరిధిలో ప్రజల అవసరాలు తీర్చేలా వీటిని నిర్మించాలని అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలో అయిదేళ్ల తర్వాత తిరిగి వీటి నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో అయిదేళ్లలో ఒక్కరైతుబజారు కూడా రాలేదు. ఏడు రైతుబజార్ల నిర్మాణానికి రూ.7 కోట్లతో అప్పట్లో టెండర్లు 13సార్లు పిలిస్తే ఒక్క కాంట్రాక్టరు కూడా ముందుకు రాక ప్రభుత్వం అభాసుపాలైంది. కూటమి ప్రభుత్వం త్వరలో సామర్లకోట, తుని, పిఠాపురంలలో వీటి పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. నిధులు లేక మధ్యలో ఆగిపోయిన కాకినాడ రాజీవ్‌స్వగృహ ఏరియా, తూరంగిలోని కొత్త రైతుబజార్‌ను పూర్తిచేయాలని భావిస్తోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



జిల్లావ్యాప్తంగా అనేక పట్టణాల్లో లక్షల్లో జనం నివసిస్తున్నారు. వీరంతా నిత్యం కూరగాయల కోసం బయట వ్యాపారులపైనే ఆధారపడుతున్నారు. కానీ బయట ధర ఎక్కువ. అయినా తాజావి దొరకని పరిస్థితి. ఈనేపథ్యంలో ప్రజల అవసరాల కోసం కొత్తగా జిల్లాలో ఏడు రైతుబజార్లు నిర్మించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు 2021లో ప్రతిపాదించారు. వీటికి మూడు నుంచి అయిదెకరాల భూములు కావాలని అంచనాలు వేశారు. అయితే వీటి నిర్మాణానికి అంచనాలు తయారుచేసిన ఇంజనీర్లు మొత్తం రూ.7.50 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. వీటిలో జగ్గంపేట రైతుబజార్‌కు రూ.67.84లక్షలు, కిర్లంపూడి 58.17లక్షలు, ఏలేశ్వరం రూ.66.36లక్షలు, కాకినాడ ఏటిమొగ రూ.33.38లక్షలు, రమణయ్యపేట రైతుబజార్ 1, 2లకు చెరో రూ.కోటి, తుని బజారుకు రూ.85.61లక్షల చొప్పున ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో 2021 ఏడాది చివర్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అయితే పని విలువ లక్షల్లో ఉండడంతో కాంట్రాక్టర్లు పోటీ పడతారని ప్రభుత్వం భావించింది. కానీ దీనికి విరుద్ధంగా గడువు పూర్తయినా ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్లు దాఖలు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో మళ్లీ రెండున్నర నెలల వ్యవధి తర్వాత ప్రభుత్వం ఇంకోసారి టెండర్లు పిలిచింది. కానీ అప్పటి జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేని కాంట్రాక్టర్లు అప్పుడు కూడా ఆసక్తి చూపలేదు. ఒకవేళ టెండర్లు దక్కించుకున్నా ప్రభుత్వం డబ్బులు ఇవ్వదనే భయంతో ఒక్కరంటే ఒక్కరు కూడా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వం పరువు బజారుపాలయింది. అయినా ఇదేదీ ఖాతరు చేయని సర్కారు ఏకంగా మూడేళ్లలో పదమూడుసార్లు రైతుబజార్ల నిర్మాణ టెండర్లు పిలుస్తూనే వచ్చింది. చివరకు ఓట్ల కోసం అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలలు ఉండన్న సమయంలో కూడా కొత్తగా మళ్లీ టెండర్లు పిలిచింది. అయినా స్పందన శూన్యం. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేక ఎవరూ ముందుకురాక రైతు బజార్ల నిర్మాణానికి గ్రహణం పట్టినట్టయింది.

15 వరకు అవసరం..

వాస్తవానికి కాకినాడ జిల్లాకు 15 వరకు కొత్త రైతుబజార్ల అవసరం ఉంది. కానీ ఈ ఏడు పూర్తయితే ఆ తర్వాత మిగిలినవి పట్టాలెక్కించాలని అధికారులు భావించారు. కానీ జగన్ ప్రభుత్వానికి ఉన్న చెడ్డపేరు కారణంగా ఏ పనికి టెండర్లు పిలిచినా కదలని పరిస్థితి. దీంతో ఇప్పటికీ జిల్లాలో కాకినాడ నగరంలో రెండు, పెద్దాపురంలో ఒకటి మాత్రమే రైతుబజార్లు నడుస్తున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం మారి కొత్తగా కూటమి సర్కారు గద్దెనెక్కడంతో అధికారుల్లో ఆశలు గురించాయి. అందులోభాగంగా ఇటీవల ప్రభుత్వం దృష్టికి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు పాత ప్రతిపాదనలను తీసుకువెళ్లారు. ఏడు కొత్త బజార్ల నిర్మాణానికి స్థలాలు కూడా ఉచితంగా సిద్ధం చేశామని వివరించారు. అటు తాజా కూరగాయలు విక్రయించేలా నేరుగా రైతులను కూడా ఎంపికచేసి ఉంచామని తెలిపారు. టెండర్లు తిరిగి పిలిస్తే ఏడాదిలోగా వీటిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం తక్షణ నిర్ణయం కింద మున్సిపాల్టీల్లో తొలుత వీటిని నిర్మించాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొత్తగా సామర్లకోట, తుని, పిఠాపురం మున్సిపాల్టీల పరిధిలో వీటి నిర్మాణానికి వీలుగా చర్యలు చేపట్టనుంది. సామర్లకోట రైతుబజారుకు స్థల సేకరణ చేయాల్సి ఉంది. తునిలో స్థలం సిద్ధంగా ఉంది. అటు పిఠాపురంలో ఎంపికచేసిన స్థలం న్యాయ వివాదంలో ఉంది. దీంతో వీటన్నింటిని వేగంగా పూర్తిచేయాలని జిల్లా అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఇందుకోసం రూ.3.50 కోట్ల వరకు వ్యయం అవుతుందని భావిస్తున్నారు. అయితే చాలాకాలం కిందటి అంచనాలు కావడంతో తిరిగి వీటికి కొత్త అంచనాలు సవరించి ఏప్రిల్‌లో వీటికి కొత్త టెండర్లు పిలిచి పని పూర్తిచేయనున్నారు. అటు కాకినాడ రూరల్‌లోని తూరంగిలో నిర్మించిన కొత్త రైతు బజారును ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రారంభించనున్నారు. అలాగే కాకినాడ రాజీవ్‌గృహకల్ప సమీపంలో రైతుబజారు నిధుల సమస్యతో మధ్యలోనే ఆగిపోయింది. దాని నిర్మాణం కూడా పూర్తిచేసి త్వరలో ప్రారంభించనున్నారు. ఆ తర్వాత దశలవారీగా మిగిలిన పట్టణాల్లో ప్రతిపాదించిన కొత్త రైతుబజార్లను నిర్మించనున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగు, సాగునీటికి ఎలాంటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో వేసవి కాలానికి అవసరమైన తాగు, సాగునీరు తదితర అంశాలపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావనతో కలిసి రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పెరుగుతున్నాయని, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగు, సాగునీటికి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సాగునీటి చెరువులను నీటితో నింపాలన్నారు. రబీ సాగుకు సంబంధించి ప్రధానంగా తాళ్లరేవు, కరప, పెదపూడి, కాజులూరు ఇతర శివారు మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 32500 ఎకరాలు, ఏలేరు రిజర్వాయర్ కింద 53017 ఎకరాలకు ఈనెల 15 నుంచి వంతుల వారీగా సాగునీరు విడుదలకు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకీకరణ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌కార్డు తరహాలో అందించనున్నదని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో సొంత భూమి కలిగిన ప్రతి రైతుతోను ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. భవిష్యత్తులో పలు పథకాల రాయితీలు పొందాలంటే రైతులు ఈ 14 అంకెల విశిష్ట అంకెల సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్, ఈఈ శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోలాహలంగా.. భీమేశ్వరుని రథోత్సవం



● ద్రాక్షారామ వీధుల్లో వైభవంగా రథోత్సవ వేడుక
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు



ద్రాక్షారామ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణ మూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృత రథంపై అర్చకస్వాములు అధిష్ఠింపజేశారు. ధూప సేవ అనంతరం 2.55 గంటలకు ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఉత్సాహంగా..

స్వామివారి రథం ఆలయం వద్ద నుంచి చంద్ర వీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. హరహరమహాదేవ శంభోశంకర అంటూ వందలాది మంది భక్తులు ఉత్సాహంగా రథయాత్రలో పాల్గొన్నారు. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన పూజ

రథం వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం వద్దకు చేరుకుంది. సాయంత్రం 6.30 గంటలకు కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. నీరాజన మంత్రపుష్పంతో ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, ఈవో అల్లువెంకట దుర్గాభవానీ, ఆలయ సిబ్బంది, ఆస్థాన పండితుడు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచకులు, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు పర్యవేక్షణలో ఏఈ మేడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించారు.





రాజాధిరాజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్యనారాయణరాజుల నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ, 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోవిందనామ, నృసింహ నామ స్మరణల నడుమ గ్రామోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీస్వామివారికి చక్రస్నానం జరగనుంది. గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయం వద్ద నుంచి ఉదయం 8 గంటలకు సముద్రం వద్దకు బయలుదేరి ప్రత్యేక పూజలు అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. సముద్రం వద్ద సుమారు వంద మీటర్ల మేర ప్రత్యేక కర్రలతో బారికేడ్లు స్నానమాచరించే ప్రదేశం వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో అఖిల, ఏసీ సత్యనారాయణతో కలిసి చక్రస్నానం, వసంత మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, డీటీ భాస్కర్, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోర సంవాదం



చోర సంవాదం ఘట్టం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.30 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16 మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతునికి మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరాకాలుడు అనే మహారాజు మారు వేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వెంకట శాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ , ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబసభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

18న ఉమ్మడి జిల్లా స్థాయి సంఘాల సమావేశాలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సమావేశాలు జరుగనున్నాయని జడ్పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి నిర్దిష్ట గడువులోపు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఓ ప్రకటనలో కోరారు.

భక్తులకు సులభతరంగా దర్శనాలు

పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి మహాశివరాత్రి పర్వదినాల్లో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు సులభతరంగా దర్శనం, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడం పూర్తయ్యే విధంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పుష్కరిణి, భక్తులు రాకపోకలు సాగించే ముఖద్వారం, బైపాస్‌రోడ్డు వైపు మార్గాలను పరిశీలించారు. క్యూలైన్లు ఎక్కడ నుంచి ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలన చేశారు. వాహనాలను పార్కింగ్ చేసే నిమిత్తం 6 ప్రాంతాలను ప్రాథమికంగా గుర్తించారు. నేరుగా దర్శనాలకు వెళ్లే భక్తులు, స్నానాలు మాత్రమే ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు మణికుమార్, జానీభాషా తదితరులున్నారు.



పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న కమిషనరు, ఈవో, సీఐ తదితరులు

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత ఉమ్మడి జిల్లా జట్లు

రెండవ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు



బాలురు, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

పిఠాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. 4రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా మంగళవారం రాత్రి పది గంటల వరకూ జరిగిన ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. బాలబాలికల విభాగాల ఫైనల్స్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు తలపడ్డాయి. రెండు విభాగాల్లోనూ ఉమ్మడి తూర్పు బాలబాలికల జట్లు విజేతలుగా నిలవగా, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలకు పిఠాపురం నియోజకవర్గ జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, జాతీయ ఉమెన్స్ టీం కోచ్ శ్రీనివాసరావు షీల్డులు, బహుమతులు అందజేశారు.

నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు

డాక్టర్ ఉమర్‌ఆలీషా

ముగిసిన పీఠం వార్షిక మహాసభలు

ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశంసించారు.

కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు అందజేత



పిఠాపురంలో కుట్టుమిషన్లు అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సామాన్యుల నుంచి తత్వవేత్తలు, సమాజంలో ఎంత ప్రముఖులైనా కాలపరీక్షలకు అతీతులు కారని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. ఆధ్యాత్మిక తాత్వికజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారానే ఈ పరీక్షలను తట్టుకోగలమని చెప్పారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగిన పీఠం వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ముగింపు సభలో భక్తులనుద్దేశించి ఆయన అనుగ్రహభాషణ చేస్తూ నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు పొందగలమన్నారు. మానసిక తృప్తి మానవుడిని సంస్కారవంతుడిని చేస్తుందని తెలిపారు. మంచి చెడులను విశ్లేషించే శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా లభిస్తుందని చెప్పారు. ప్రతి చిన్న విషయాన్ని అసహనానికి గురవుతూ మానవుడు అనేక సమస్యలను కొని తెచ్చుకుంటున్నాడని తెలిపారు. ధ్యాన, జ్ఞాన మంత్రసాధనలతో కూడిన త్రయీ సాధన ద్వారా సహనశక్తిని అలవర్చుకుని దీనిని అధిగమించివచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని సూచించారు. విశ్వమానవ శ్రేయస్సుకు పాటుపడుతూ పీఠం ద్వారా అందిస్తున్న సేవలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశంసించారు.

ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు, ఎన్‌ఆర్ఐ సభ్యులు పేరూరి విజయరామ సుబ్బారావు, నన దంపతులు భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రం కొరకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రోస్టిమ్యులేటర్లను పీఠాధిపతి డాక్టర్, ఉమర్‌ఆలీషా, ఇతర ప్రముఖులు అందజేశారు. పీఠం రూపొందించిన కరదీపకలు, గ్రంథాలను ఆవిష్కరించారు. పీఠం నిర్వహిస్తున్న తాత్విక బాలవికాస్ ద్వారా ఆధ్యాత్మిక శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన చిన్నారుల ప్రసంగాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ నందిని పాండా, గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, అహ్మద్ ఆలీషా, హుస్సేన్‌షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, ఏవీవీ సత్యనారాయణ, ప్రసాద వర్మ, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆరికిరేవులలో సినిమా షూటింగ్

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో రామ్ పోతినేని 22వ సినిమా షూటింగ్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. మైత్రీ మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇంకా పేరు పెట్టలేదు. మంగళవారం ఆరికిరేవుల స్నానఘట్టం, గోదావరి నది వద్ద సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాకు మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్‌లు నటిస్తున్నారు. వివేక్ మార్విన్‌లు మ్యూజిక్ అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌గా సాగే చిత్రం కావడంతో మరో నెల రోజులపాటు కొవ్వూరు పరిసర ప్రాంతాలో చిత్ర నిర్మాణం జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు.



కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరుగుతున్న షూటింగ్

సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించాలి

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడలో హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడ హాకీ పట్ల జిల్లా యువతలో ఆసక్తి, అనురక్తి పెంపొందేరీతిలో కాకినాడ డీఎస్‌ఏ స్టేడియంలో జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక క్రీడా ప్రాధికార సంస్థ మైదానాన్ని సందర్శించి 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన హాకీ పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాచుర్యం, ప్రోత్సాహం కల్పించేందుకు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేసి, జాతీయ స్థాయి హాకీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ టోర్నమెంట్ ఈనెల 15 నుంచి 28వరకు 2వారాలపాటు డీఎస్‌ఏ మైదానంలో జరుగుతుందన్నారు. పోటీల్లో పా ల్గొంనేందుకు విచ్చేసే క్రీడాకారులకు తగు సదుపాయాలతో బస, రవాణా, వారి అలవాట్ల కనుగుణమైన ఆహారం ఏర్పాటు చేయాలన్నా రు. పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం స్టేడియం చేరువలో పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. స్టేడియంలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, డీఎస్డీఏవో శ్రీనివాస్‌కుమార్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తదితరలున్నారు.

డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల

మోతుగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు మంగళవారం 3వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. గోదావరి డెల్టా రబీ పంటలకు సీలేరు కాంప్లెక్స్ నుంచి 10టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారులను కోరడంతో తమ అధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం నుంచి 3వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చెయ్యకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదలు చేస్తున్నామన్నారు. 10 టీఎంసీల నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున 40రోజులు పాటు నీటి విడుదల కొనసాగించాలని ఇరిగేషన్ అధికారులు కోరినట్టు ఈఈ బాలకృష్ణ తెలిపారు. అలాగే కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 4వేల క్యూసెక్కుల నీరు కూడా గోదావరి డెల్టాకు చేరుతుందని తెలిపారు. డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా జలాశయం దిగువున ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... నదీ ప్రవాహాన్ని దాటుట, దాని పరిసరాలకు వెళ్లరాదని, ప్రజలు, పెంపుడు జంతువులు ఏమైనా ఉన్నా డొంకరాయి జలాశయం దిగువకు రాకుండా చర్యల చేపట్టి అప్రమత్తంగా ఉండాలని అధికారులు డొంకరాయి జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఇరానీ గ్యాంగ్ అరెస్టు

- రాజమహేంద్రవరం పరిసరాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు
- వలవేసి పట్టేసిన తూర్పు పోలీసులు
- 380 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసరాల్లో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు ముఠా సభ్యులైన ఇరానీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన రాజమహేంద్రవరంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఇటీవలజరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించి నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు, నగరం చుట్టూ పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. కొంత సమాచారం ఆధారంగా ఒడిశాలోని మారుమూల ప్రాంతంలోని ఇరానీగ్యాంగ్ ఈ దురాగతాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారించుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడానికి ఒక ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈలోపు గామన్ బ్రిడ్జిపై వాహన తనిఖీలు చేస్తుండగా కొందరు పట్టుబడ్డారు. వారిని ప్రశ్నించగా నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న ఒడిశాలోని నౌపడ జిల్లా కరియర్ రోడ్‌కి చెందిన జహీర్ హుస్సేన్ అబూ తాలిబ్, మహ్మద్ షబ్బార్, ఖాసీం అలీ, కిస్మత్ అలీ, దిల్‌రుబా బేగం సోహైల్, అబ్బాస్ అలీ అనే ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. అదే ప్రాంతానికి చెందిన హైదర్ అలీ, జావెద్ అలీ అనే ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. చాలాఏళ్ల కిందట ఇరాన్‌నుంచి వచ్చి తిక్రీ అనే ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నందున వాళ్లను ఇరానీ గ్యాంగ్‌గా పిలుస్తున్నారని చెప్పారు. వాళ్లపై ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయన్నారు. అక్కడ వీళ్లను మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పోలీసులు ప్రకటించారన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి 382 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్ బాబు, రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలశౌరి, సీఐ రాంబాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్ఐ ఎండీ జుబేర్, స్పెషల్ టీం, టెక్నికల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.



కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్‌బాబు, రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ అప్పారావులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

యువశక్తిని మేల్కొల్పేందుకు..
దేశవ్యాప్త స్కేటింగ్ యాత్ర



కత్తిపూడిలో యాత్రకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, సంఘ సభ్యులు

- కాశీ నుంచి 20 రాష్ట్రాల మీదుగా 10,550 కి.మీ. యాత్ర
- గిన్నీస్ రికార్డ్ లక్ష్యంగా యువతి ప్రయత్నం
- కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘన స్వాగతం

శంఖవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ యువశక్తిని మేల్కొల్పేందుకు, మహిళాసత్తాను చాటేందుకు కాశీనుంచి కాశీకి దేశవ్యాప్తంగా స్కేటింగ్ యాత్ర చేస్తున్న సోనీ చౌసియా అనే యువతికి కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘనస్వాగతం లభించింది. స్కేటింగ్ చేస్తూ వచ్చిన ఆమెకు మంగళవారం కాకినాడ జిల్లా స్కేటింగ్ సంఘ సభ్యులు, కత్తిపూడి గ్రామస్తులు ఆహ్వానం పలికారు. 20 రాష్ట్రాల మీదుగా 10,550కిలోమీటర్లు సాగే ఈ యాత్ర కత్తిపూడికి చేరుకుంది. ఈ సందర్భంగా సోనీ చౌసియా మాట్లాడుతూ మే 12కి కాశీకి చేరుకునేలా ప్రణాళికలు చేసుకున్నామని, గిన్నీస్ బుక్‌లో రికార్డ్ లక్ష్యంగా ఈ యాత్రను చేస్తున్నానని తెలిపారు. తనకు అపూర్వ స్వాగతం తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ మురమళ్ల శివయ్య, ప్రత్తిపాడు కండ కార్యవాహ మొండి వీరవెంకటరమణ, జిల్లా ప్రచారప్రముఖ్ సత్యలింగేశ్వరావు పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళాలు



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత హరికృష్ణ దీప్తి



పీఆర్‌వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత దీప

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఇద్దరు దాతలనుంచి రూ.2లక్షలు విరాళాలుగా సమకూరాయి. విజయవాడకు చెందిన హరికృష్ణ దీప్తి, సుశ్రిత్‌కృష్ణ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా చెన్నయికి చెందిన వెంకటరావు, దీప దంపతులు పీఆర్వో కృష్ణారావుకు అందించారు. దాతలను వారు అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. అన్నదాన విభాగ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులున్నారు.

న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన



ప్రియుడి ఇంటి ముందు నిరసన తెలియచేస్తున్న యువతి బంధువులు

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలో ఘటన

మామిడికుదురు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన వ్యక్తి పెళ్లికి ముఖం చాటేశాడని పేర్కొంటూ ఓ యువతి తన ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేపట్టింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలోని పాశర్లపూడిలో మంగళవారంజరిగిన ఈఘటన చర్చనీయాంశమైంది.
దీనికి సంబంధించిన కాట్రేనికోన చెయ్యేరు పండువారిపేటకు చెందిన బాధిత యువతి తెలిపిన వివరాలివి. పాశర్లపూడి బాడవ చింతలమెరక ప్రాంతానికి మోకా ప్రవర్ష్, తాను కాకినాడలో చదువుకుంటూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని తెలిపింది. తమ ప్రేమ విషయం ఇంట్లో అందరికీ తెలుసునని, ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రేమ విషయమై రెండు, మూడుసార్లు పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయని, రెండు నెలలుగా ప్రవర్ష్ తనను దూరం పెట్టి అందుబాటులో లేకపోవడంతో 15 రోజుల క్రితం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితురాలు పేర్కొంది. ప్రవర్ష్ తండ్రి పెద్దల సమక్షంలో పెళ్లికి అంగీకరించినప్పటికీ తర్వాత అతడిని కుటుంబసభ్యులు కట్టడి చేయడంతో తనను దూరం పెట్టాడని, తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ప్రవర్ష్ ఇంటి ఎదుట బంధువులు, సన్నిహితులతో కలిసి ఆందోళన చేపట్టింది. అతడితో తనకు పెళ్లి చేయకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హెచ్చరించింది. విషయం తెలుసుకున్న నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో చర్చించి ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెళ్లి విషయంపై పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ఒకదశలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని, నిరసన విరమించుకోవాలని కోరడంతో యువతి బంధువులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించి వెనుదిరిగారు.

సాంకేతికత సాయంతో కాపాడారు

- ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కోనసీమకు చెందిన వ్యక్తి సెల్ఫీ వీడియో
- అన్నవరంలోని ఓ లాడ్జీలో ఉన్నట్టు సాంకేతికత ద్వారా కనుగొన్న పోలీసులు
- సురక్షితంగా బంధువులకు అప్పగింత

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఒక నిండుప్రాణాన్ని కాపాడింది. దీనికి పోలీసుల కృషి తోడైంది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో స్నేహితులకు పంపాడు. ఈ సమాచారాన్ని అతడి కుటుంబసభ్యులు పి.గన్నవరం సీఐకు తెలపడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా అతడు అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి అన్నవరం ఎస్ఐకి సమాచారమివ్వగా ఆయన లాడ్జిల యూనియన్ వాట్సాప్ గ్రూప్‌లో సెల్ఫీ వీడియో ఫార్వర్డ్ చేశారు. ఏ లాడ్జి నుంచి వీడియో తీసుకున్నాడనేది తెలియపరచాలని అప్రమత్తం చేయడంతో నిమిషాల వ్యవధిలో ఒక లాడ్జి యజమాని స్పందించి తన పక్కనున్న లాడ్జిలో తీసిన వీడియో అని బదులిచ్చాడు. వెంటనే అక్కడికి వెళ్లి తలుపుతట్టి సంబంధిత వ్యక్తిని బయటకి రప్పించాడు. వెంటనే అన్నవరం ఎస్ఐ హరిబాబు సిబ్బందితో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు అన్నవరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించిన ప్రైవేటు లాడ్జి యజమానిని ఎస్ఐ హరిబాబు అభినందించారు. కాగా, ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన పోలీసు యంత్రాంగాన్ని కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

అన్నవరంలో వాట్సాప్ ద్వారా వ్రతాలు, దర్శన సేవలు

అన్నవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవల్లో అన్నవరం ఆలయానికి సంబంధించి సేవలను అందుబాటులో ఉంచినట్లు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు 9552300009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని టైప్ చేస్తే సేవలకు రుసుం డిజిటల్ చెల్లింపు ద్వారా తీసుకుని వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు చెల్లింపు చేసుకోవచ్చునన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని తమ ఇంటి నుంచే బుక్‌చేసుకుని అన్నవరం ఆలయానికి విచ్చేసి బుకింగ్ రశీదు ప్రింట్ తీసుకుని కార్యాలయంలో అందజేస్తే ఎంచుకున్న సేవలను అందిస్తామన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి గోదావరిలో వంతెన సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని రావులపాలెం ఎస్ఐ చంటి తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలు 5.4 అంగులాల పొడవు, 6 అంగులాల జట్టు, నీలి రంగు చీర, జాకెట్టు కలిగి ఉందన్నారు. చర్మం పూర్తిగా కమిలిపోయి గుర్తుపట్టకుండా మారిపోయిందని, ప్రమాదవశాత్తూ నదీలో జారి పడి ఇక్కడకు ప్రవాహానికి కొట్టుకొచ్చి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని బంధువుల గుర్తింపుకోసం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

మహిళ వేషంలో బంగారం చోరీ

- వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్త్రీ వేషం ధరించి ఒక పురుషుడివద్ద రూ.లక్ష విలువచేసే బంగారు గొలుసు అపహరించాడు. దీనిపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడివద్ద సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఎవరైనా ట్రాన్స్‌జండర్లుగా జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల జాతీయ రహదారిపై, షాపుల వద్ద ఎదుటివారిని అవమానపరిచేలా మాట్లాడినా, భౌతికదాడికి పాల్పడినా, అశ్లీల నృత్య ప్రదర్శనలు చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని మనస్తాపం చెందిన ఓ యువకుడు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన చిట్ర సూర్య రాజమహేంద్రవరంలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాడు. వాడపల్లికి చెందిన బాలికతో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం ఉంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, అమ్మమ్మ, మేనమామ, తాతయ్య అతడిని దీనిపై ప్రశ్నించారు. సూర్య ఇంట్లో కూడా విషయం చెప్పడంతో తండ్రి చిట్ర శివ, అతని భార్య బాలిక ఇంటికి వెళ్లారు. దీంతో బాలిక తరుపు వారు, రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది అందరూ కలిసి వీరిని దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించారు. తనవల్ల తల్లిదండ్రులు అవమానపడ్డారని మనస్తాపం చెందిన సూర్య సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా హాలులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బాలిక కుటుంబసభ్యులు ఐదుగురిపై పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరించడం, కొట్టడం, మూకుమ్మడి దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ముందుజాగ్రత్తగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

పిఠాపురంలో 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యంతో సీఐ, ఎస్ఐలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో మంగళవారం రెండు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించి 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాల్లో రేషన్‌బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ దాడులు నిర్వహించారు. బి.ప్రత్తిపాడులో రైసుమిల్లు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో లారీ, వేన్‌ల ద్వారా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ, వేన్‌ల్లో ఉన్న 144 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఊటా రాజు, శివశంకర్, వెలుగుల చినబాబ్జిలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్‌కేపాలెంలో కీర్తి సూరిబాబు ఒక నివాసంలో నిల్వ ఉంచిన 16 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

దుర్గాడలో 25.50క్వింటాళ్లు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. వేన్‌లో తరలిస్తున్న 25.50క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేన్‌ను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన కర్రి కృష్ణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తగా పది ఓపెన్ ఇసుక ర్యాంపులు

- నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్
- మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలాఖరు నాటికి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా 10 ఓపెన్ ర్యాంపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవులలో ఇసుకర్యాంపు ఏర్పాటుపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లారీలకు తప్పనిసరిగా టార్పాలిన్ కట్టాలని, రోడ్లపై ఇసుక జారి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆరికిరేవుల, చిడిపి, పక్కిలంక, తాడిపూడి, పురుషోత్తపల్లి, మునికూడలి, పెండ్యాల, కాటవరం, శింగవరం గ్రామాల్లో ఓపెన్ ర్యాంపులకు ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. జిల్లాలో ప్రసుత్తం 9 డీసిల్టేషన్ ర్యాంపులు నడుస్తున్నాయని, రేపటిలోగా మిగిలిన 8 డీసిల్టేషన్ ర్యాంపులకు అనుమతులు ఇస్తామన్నారు. ఓపెన్ ర్యాంపులు 12నడుస్తున్నాయన్నారు. వేమగిరి, జీడి గుంట ర్యాంపులను రద్దు చేశామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో మంగళవారం రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలుఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజమహేంద్రవరం రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం... మృతి చెందిన వ్యక్తికి 40 ఏళ్ల ఉంటాయని, నీలం రంగు షర్ట్, నలుపురంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తుపట్టలేనివిధంగా ఉందని రైల్వే ఎస్ఐ పి.లోవరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో మాజీ ఉపరాష్ట్రపతి కుటుంబీకుల పూజలు

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిదిలో మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఈడబ్ల్యుఎస్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకు అందిన ఫలితాల్లో నలుగురు విద్యార్థులు కోటిపల్లి యశ్వంత్‌సాత్విక్, కోడూరి యశ్వంత్ రాజా, పి.శరత్ సంతోష్, దువ్వ ఆశిష్ సాయి శ్రీకర్ 99.99 పర్సంటైల్ సాధించారని, నవులూరి ఆశ్రిత్ సాయి, కంచుమర్తి ఫణీత్ , ఎస్.ఉదయ్ పవన్ 99.98 పర్సంటైల్ సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్లు, ప్రిన్సిపాల్‌తో కలిసి తిరుమలరావు అభినందించారు.

మోసగించిన కేసులో రెండేళ్ల జైలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి సొమ్ములు తీసుకుని మోసగించిన కేసులో నేరారోపణ రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ ముమ్మిడివరం జుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ రహ్మతుల్లా మంగళవారం తీర్పు చెప్పారు. ఉప్పలగుప్తంమండలం భీమనపల్లికి చెందిన జంపనగణేష్‌రాజు 2017లో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురినుంచి డబ్బు తీసుకుని మోసగించగా ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పైవిధంగా తీర్పు వచ్చిందని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

ప్రత్తిపాడులో ఘనంగా మేరీమాత యాత్ర మహోత్సవాలు



ప్రత్తిపాడులో మేరీమాతను ఊరేగిస్తున్న భక్తులు



మరేగిరి కొండపై ప్రార్థనలు చేస్తున్న భక్తులు

- ఉమ్మడి తూర్పు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రైస్తవ భక్తజనం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. నాలుగు రోజులుగా మేరీమాత ఉత్సవాలు కొనసాగుతూ ఉన్న ముగింపురోజు మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి మరేగిరికి భక్తజనం పోటెత్తడంతో ఆ పరిసరాలు జనసందోహంతో కిటకిటలాడాయి. మరేగిరిపై కొలువైఉన్న మేరీమాతను, లూర్ధ్‌మాతను, యాకుల మాత, ఏసుప్రభువు విగ్రహాలను భక్తులు సందర్శించారు. అనంతరం కొండపై నిర్వహించిన క్రైస్తవప్రార్థనలో వేలాదిమంది పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రజక జూబ్లీయేరియన్స్, సాలురు, రాజమహేంద్రవరం, అరకు, విజయనగరాలకు చెందిన గురులు పి.జోసెఫ్, ఈ.రవీంద్రకుమార్, ఎం.జేసుదాసు, ఎం.లూర్దులు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి మానవాళి, జీవన ఉన్నతికి, ఐక్యతకు క్రీస్తు సందేశాలు దోహదపడతాయన్నారు. భక్తులకు నిర్వాహకులు, స్థానిక సేవా సంస్థల కార్యకర్తలు అన్నదానం చేసి మజ్జిగ, మంచినీరు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చోరీ కేసులో బంగారు ఆభరణాల రికవరీ

రాజానగరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల అపహరణ కేసులో నిందితుడిని అరెస్టు చేసి ఆభరణాలను రాజానగరం పోలీసులు రికవరీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో జరిగిన ఈచోరీకి సంబంధించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవెలుగుబంద గ్రామానికి చెందిన ప్రగడకృష్ణ గతేడాది ఏప్రిల్ 1న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. మర్నాడు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, బీరువా తాళాలు బద్దలు కొట్టి బీరువాలో భద్రపర్చిన 249.5 గ్రాముల పలు రకాలైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లుగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావు అలియాస్ చిన్న అనే వ్యక్తిని నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేశామని, అతని నుంచి చోరీకి గురైన 156.625 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇంకా మిగిలిన 66 గ్రాముల బంగారు ఆభరణాలు ముథూట్ గోల్డ్ పాయింట్ షాపునుంచి రికవరీ చేయాల్సి ఉందన్నారు.సంఘటనా స్థలం సమీపంలో నమోదైన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో 27కుపైగా కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుడిని పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలను రికవరీ చేసిన సీఐతో ఎస్ఐ మనోహర్, హెచ్‌సీ అమ్మిరాజు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

కాకినాడ

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): నగరపాలక కమిషనర్ భావన మంగళవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. బాలాజీ చెరువు సెంటర్, టీటీడీ కల్యాణమండపం, 29బి డివిజన్లలో లక్ష్మీనారాయణ కంపెనీరోడ్డు, అక్కడి నుంచి డెయిరీఫాం సెంటర్, మూడో సర్కిల్‌లోని ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

సంఘ సభ్యుల ఐక్యతతోనే సంక్షేమం సాధ్యం

ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సంఘ సభ్యుల ఐక్యతతోనే సంక్షేమం సాధ్యమని, అందరూ ఒకే తాటిపైకి వచ్చి జిల్లా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కాలనీలో మంగళవారం కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్ అండ్ హెల్పర్స్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ 21 మండలాల సంఘాల సభ్యులు కలిసి జిల్లా సంఘంగా ఏర్పడడం చాలా మంచి పరిణామమన్నారు. సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, నగర టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నగర శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు చొల్లంగి వీరబాబు, జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్ అండ్ హెల్పర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికట్ల లోవరాజు, కార్యదర్శి కుక్కల గణిరాజు, ఉపాధ్యక్షుడు పెంకే మారయ్య, కోశాధికారి డింగ్ రాజు, సౌండ్ సిస్టమ్స్ అధినేతలు వర్రే శ్రీను, ప్రేమ్ ఉన్నారు.



కాకినాడలో సభ్యులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో శ్రీపెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన చేశారు. మత్స్యకారుల గ్రామదేవతలు కొలువుదీరేందుకు గ్రామస్థులు, పెద్దలు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఓసుపల్లి రాజేశ్వరి, నాయకులు సోది ముసలయ్య, శెట్టి బాబూరావు, భాస్కర్, కరెడ్లగోవిందు, గరికిన అప్పారావు, గరికిన సురేష్, మైలపల్లి జగన్నాథం పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు నిరోధించేందుకు పౌష్టికాహారం ఎంతో కీలకం : డీఐవో



సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణులకు సూచనలు చేస్తున్న డీఐవో, అధికారులు

సామర్లకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాతా శిశుమరణాలు పూర్తిస్థాయిలో నిరోధించేందుకు పౌష్టికాహారం ఎంతో కీలకం అని, అలాగే ప్రతీ గర్భిణి జాగ్రత్తలు పాటించడం ద్వారా సుఖప్రసవం అయ్యేందుకు దోహదపడుతుందని జిల్లా వ్యాధినివారణాధికారి డాక్టర్ కెవీ.సుబ్బరాజు పేర్కొన్నారు. సామర్లకోట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని సుబ్బరాజు డీపీహెచ్ఎన్‌వో టి.నీలవేణి, డీపీసీ కె.నరేష్‌లతో కలిసి పర్యవేక్షించారు. డాక్టర్లు కెవీపి రమ్యప్రభ, పి. రమాశ్రీ దుర్గల నేతృత్వంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించడాన్ని డీఐవో, ఉన్నతాధికారుల బృందం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆసుపత్రిలో వివిధ వ్యాక్సిన్‌లు భద్రపరిచే డీప్ ఫ్రీజరు, ఐఎల్ఆర్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. సుమారు 44మంది గర్భిణులకు పౌష్టికాహారం స్వీకరణ, నిత్యమెళకువలు పాటించడంపై సమగ్రంగా వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎండీ.సత్తార్‌బీబీ తదితర ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

పిఠాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులకు మద్దతుగా ఎమ్మెల్సీ ఐవీ వెంకటేశ్వరరావు మంగళవారం పిఠాపురంలో ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, కోర్టుల వద్ద న్యాయవాదులు, పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును వీరరాఘవులకు వేయాలని అభ్యర్థించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు కుంచే చిన్నా, సూరిబాబు, సీతారామరాజు, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథం, భాస్కర్, వీరబాబు, రాజేష్, సిద్దు తదితరులు ఉన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీరరాఘవులు విజయానికి గ్రాడ్యుయేట్లు సహకరించాలని ఎమ్మెల్సీ ఐవీ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సామర్లకోటలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి వీరరాఘవులు విజయాన్ని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నరవ సురేష్ కుమార్, దారబాని కృష్ణ, చల్లా మహేష్, ఏడుకొండలు,పి.వీరబాబు, సింహాచలం పాల్గొన్నారు.



సామర్లకోటలో ప్రచారం నిర్వహిస్తున్న ఐవీ

వ్యవసాయశాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఏపీ వ్యవసాయ అధికారుల కాకినాడ జిల్లా అసోసియేషన్ సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్, ప్లాంట్ డాక్టర్స్ డైరీని కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో ఏఎస్పీ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ వన్‌టౌన్ పోలీసులు జగన్నాథపురంలోని జె.రామారావుపేట సిద్ధివినాయక అపార్టుమెంట్లో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. సీఐ ఎం.నాగదుర్గారావు తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి 12మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,41,110 నగదు, 11 సెల్‌ఫోన్లు, 6మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారందరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పుస్తకాల పంపిణీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ రాత పరీక్షకు అర్హత సాధించిన 60 మంది హోంగార్డులకు శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అందించిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జనవరిలోలో జరిగిన పోలీస్‌కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో (పీఈటీ, పీఎంటీ) 60 మంది హోంగార్డులు ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు హోంగార్డుల సౌలభ్యం, ఉద్యోగం సాధించేందుకు అవసరమైన 13 రకాల పుస్తకాల కిట్‌ని అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఆర్ఐ హోంగార్డ్సు నరసింహమూర్తి పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మంగళవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిల్లల సంరక్షణ, రక్షణ (జువైనల్ జస్టిస్) చట్టంపై అన్ని పోలీసు స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో జూమ్ వీడియా ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు. పిల్లల సంరక్షణ, రక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్‌యాక్ట్ అమలు, నిర్వహణ, మిషన్ వాత్సల్య పథకం, పిల్లల సంరక్షణ, రక్షణ సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక భానుగుడి సెంటర్ నందు గల సైస్ కంప్యూటర్ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ జంగం బాబ్జీ తెలిపారు. స్టాండర్డ్ చార్టెడ్ కెరీర్ అకాడమీ సీఎస్ఆర్ పథకంలో శిక్షణ ఇస్తామన్నారు. టాలీ, కంప్యూటర్ అసిస్టెంట్, రిటైల్, కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ పాసై 18 నుంచి 27 ఏళ్ల లోపు వయసుగల నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 రోజులు శిక్షణ ఉంటుందని అనంతరం ధృవీకరణ పత్రంతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 13లోగా తమ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912300248, 9299907346 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

వేట్లపాలెంలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉత్సవమూర్తులకు హనుమద్వాహనవాహనంపై గ్రామోత్సవం జరిగింది.



పిఠాపురం పట్టణంలోని కోట వెనుక రోడ్డు చెంతనే నిలిచిపోయిన మురుగునీరు

రోడ్డుపై మురుగునీరు!

దుర్గంధపూరిత వాతావరణంతో ఇక్కట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పిఠాపురం పట్టణంలోని కోట వెనుక వీధిలో, ఆదిత్య స్కూలుకు సమీపంలో రోడ్డు చెంతనే భారీగా మురుగునీరు నిలిచిపోయింది. మంగళవారం మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో పాటు ఆ ప్రాంతం దుర్గంధపూరితంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తక్షణం నిలిచిపోయిన మురుగునీటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

రాజ్యసభలో ఎంపీ సానా సతీష్‌బాబు

న్యూఢిల్లీ/ కాకినాడ సిటీ ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైందని రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీష్‌బాబు అన్నారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థ కుప్పకూలిందని, రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. మంగళవారం రాజ్యసభలో ఆయన తొలిసారి మాట్లాడారు. 'లోక్‌సభలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పోలవరంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత సీఎం చంద్రబాబు గడిచిన 7 నెలల్లో ఐదు సార్లు పోలవరాన్ని సందర్శించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. సీఎం చంద్రబాబు హయాంలో పోలవరం పూర్తి అవుతుంది. గత ఐదేళ్లలో ఏపీకి రాజధానిని లేకుండా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తారని వైసీపీ ఎంపీలు అసత్య ఆరోపణలు చేస్తున్నారు' అని సతీశ్ పేర్కొన్నారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన గత వైసీపీ ప్రభుత్వం

లోక్‌సభలో కాకినాడ ఎంపీ ఉదయ్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్లక్ష్యం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో నవ్యాంధ్ర నిర్మాణానికి కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు, రైతాంగానికి మేలు చేసే విధంగా అనేక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడా రు. గత ప్రభుత్వం హయంలో ఇంటింటికి తా గునీరు అందించేందుకు కేంద్రం జలజీవన్ మిషన్ ద్వారా రూ.16వేల కోట్లు మంజూరు చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేసి పథకాన్ని నిర్వీర్యం చేసింద న్నారు. ఏపీలో ఒకేరోజు 13326 గ్రామసభలు నిర్వహించడంతో పాటు, 30 వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చేట్టి రికార్డు సృష్టించామని ఎంపీ పేర్కొన్నారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ

పేరాబత్తుల విజయానికి సహకరించండి

టీడీపీ నాయకుల ప్రచారం

కరప, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి అందరూ సహకరించాలని టీడీపీ నేతలు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు విజ్ఞప్తిచేశారు. కరపలో మంగళవారం కూటమి నాయకులతో కలిసి వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి రాజశేఖర్‌కు ఓటేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజాసేవకుడు పేరాబత్తుల రాజశేఖర్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దేవు వెంకన్న, బండారు మురళి, ముద్రగడ రమేష్, కోన వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థికి అండగా నిలవాలి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలవాలని పిఠాపురం, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పీలా గోవిందులు కోరారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలోని గ్రామ సచివాలయాలు, మండలపరిషత్ ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో వారు ప్రచారం నిర్వహించారు. ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కరపలో ప్రచారం నిర్వహిస్తున్న నులుకుర్తి, చప్పిడి

ఫోన్ వినియోగించేటపుడు అత్యంత జాగ్రత్త : వీసీ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్‌ను వినియోగించేటపుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జేఎన్టీయూకే ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని సెనేట్‌హాల్లో మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో సీఎస్ఈ విభాగంలోని ఐఎస్ఈఏ ప్రాజెక్ట్ ఫేజ్-3 ఆధ్వర్యంలో సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా ఇంటర్నెట్ సురక్షితమైన, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ, ఏంసీఏ, ఎంటెక్ సీఎస్ఈ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రతీరోజూ గంట పాటూ ప్రకృతితోనూ, పుస్తకాలు, స్నేహితులతో సమయం గడిపితే ఇంటర్నెట్‌కు పరిమితంగా సమయం కేటాయించవచ్చన్నారు. ప్రతీ ఏడాది ఫిబ్రవరి 11న సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ఈ ఏడాది మెరుగైన ఇంటర్నెట్ కోసం అనే థీమ్‌తో జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఏఎస్ఎన్ చక్రవర్తి, సీఎస్ఈ విభాగాధిపతి ఎన్.రామకృష్ణయ్య పాల్గొన్నారు. పలు పోటీలలోని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద మంగళవారం విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. అంతర్గత కలహాల కారణంగా విద్యార్థులు 2 వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడిచేశారు. అయితే ఆ విద్యార్థులంతా ప్రిన్సిపాల్‌కు ఈ సమస్యపై ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని సమాచారం. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేసేందుకు 100కు ఫోన్ చేశారు. అయితే సమస్యపై వివరణ కోసం ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించినా స్పందించలేదు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మున్సిపాల్టీ అధికారులు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాకు మంగళవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు వార్డుల్లో నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉండూరు రోడ్డులో ఉన్న ప్రధాన పైప్‌లైన్ పెద్దఎత్తున లీకులు కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాస్ తదితర సిబ్బంది పైప్‌లైన్‌ల మరమ్మతుల పనుల్లో నిమగ్నమయ్యారు.

పేదలకు పట్టాలివ్వాల్సిందే : మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాల్సిందేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి సర్వే నెంబరు1లో గల 456 ఎకరాల ప్రభుత్వ, కొండపోరంబోకు భూములను సాగు చేసుకుంటున్న చెందుర్తి, కొడవలి, వజ్రకూటం గ్రామాలకు చెందిన పేదలు మంగళవారం రాత్రి వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్ వచ్చి వాటిన పరిశీలించడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో కాకినాడ కార్పొరేషన్ డంపింగ్‌యార్డు, పోలీసు అకాడమీ కోసం ఈ భూములు కేటాయించగా, తాము ప్రభుత్వంతో మాట్లాడి వాటిని ఆపిన విషయాన్ని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ పెద్దల దృష్టిలో పెట్టి వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.



పిఠాపురంలో వర్మకు వినతిపత్రం అందజేస్తున్న చెందుర్తి, కొడవలి గ్రామాల సాగుదారులు

'ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు పిఠాపురంలో కార్తీకేయ హాస్పటల్స్ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ 15 స్టాపర్ బోర్డులను పోలీసుశాఖకు సమకూర్చింది. మంగళవారం ఈ బోర్డులను సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐలకు ఆసుపత్రి అధినేత డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్ అందజేశారు. పట్టణం, బైపాస్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడే స్టాపర్ బోర్డులు అందించిన కాశీవిశ్వనాథ్‌ను సీఐ అభినందించారు. పట్టణ ఎస్ఐ మణికుమార్, అదనపు ఎస్ఐ జానీభాషా తదితరులున్నారు.



పోలీసుశాఖకు స్టాపర్ బోర్డులు అందజేస్తున్న మొగలి కాశీవిశ్వనాథ్.. చిత్రంలో సీఐ, ఎస్ఐ

కనుల పండువగా కుంతీమాధవుని రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో కుంతీమాధవుని రథోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఆలయం నుంచి మోసుకుంటూ ప్రదర్శనగా తీసుకువచ్చి రథం పై ఉంచారు. అనంతరం పురవీధులు గుండా రథాన్ని నడిపించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథం ఫైర్‌స్టేషన్, అంబేడ్కర్ సెంటర్, పాతబస్టాండు, సినిమా సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్‌కు చేరుకోగా రథంలో ఉన్న ఉత్సవ మూర్తులను భారీగా తరలివచ్చిన భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. భారీగా బాణ సంచా కాల్చారు. అంతకుముందు కుంతీ మాధవునికి విశేషపూజలు జరిగాయి. కార్యక్రమాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కుంతీమాధవ భక్తబృందం సభ్యులు, ఈవో నున్న శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.



పిఠాపురంలో కుంతీమాధవుని రథోత్సవం దృశ్యం

నేడు ఉప్పాడ రేవులో మాఘపౌర్ణమి పుణ్యస్నానాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా ఉప్పాడ రేవులో బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. తెల్లవారుజామున పిఠాపురం నుంచి శ్రీకుంతీమాధవస్వామిని పల్లకీలో ఊరేగించుకుంటూ ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి చక్రస్నానాలు చేయిస్తారు. అనంతరం జిల్లాలో నలుమూలల నుంచి వచ్చిన భక్తులు సముద్రంలో మాఘపౌర్ణమి స్నానాలు ఆచరిస్తారు. సముద్రస్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు స్నానాల రేవు వద్ద టెంట్ ఏర్పాటు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా సముద్రంలో స్నానాలు చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయసంఘటనలు జరుగకుండా 20మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, స్నానాల రేవుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ చెప్పారు.

ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి(ఆంగ్ల మాధ్యమం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పిఠాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పీవీ త్రివేణి తెలిపారు. అర్హులైన అభ్యర్థుల ఎంపికకు ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10నుంచి 12గంటల వరకూ ఐదో తరగతి, మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకూ ఇంటర్మీడియట్ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అర్హులైన విద్యార్థులు మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

పదో తరగతి పరీక్షలకు తొమ్మిది కేంద్రాలు

సామర్లకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సామర్లకోట మండలం, పట్టణంలోనూ 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య వెల్లడించారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సామర్లకోట పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రతిభ విద్యానికేతన్, జడ్పీ ఉన్నత పాఠశాల వేట్లపాలెంలో 2 పరీక్షా కేంద్రాలు, జడ్పీ ఉన్నత పాఠశాల నవర, జడ్పీ ఉన్నత పాఠశాల వీకె.రాయపురం, జడ్పీ ఉన్నత పాఠశాల ఉండూరు గ్రామాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెంది 1,040 మంది, ప్రైవేట్ పాఠశాలలకు చెంది 460 మంది పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

'త్వరలో పాస్టర్లకు గౌరవ వేతనాలు'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ల గౌరవ వేతనాలు త్వరలో బ్యాంకు అకౌంట్లలో జమ కానున్నాయని నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం వెల్లడించారు. దీనిపై మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి చర్చించామన్నారు. గతేడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు పాస్టర్ల గౌరవ వేతనాల బకాయిలు చెల్లించేందుకు సెమి క్రిస్మస్ రోజున ఫైల్‌పై సంతకం చేసిన విషయాన్ని తెలియజేశామన్నారు. దీంతో ఈ విషయమై, సంబంధిత సెక్షన్ ఆఫీసర్‌తో మాట్లాడారని, టెక్నికల్ సమస్య వల్ల ఆలస్యమైనట్లు ఆయన తెలిపారన్నారు. ఈ వారంలో అందరు పాస్టర్ల అకౌంట్లలో బకాయిలతో పాటు గౌరవ వేతనాలు జమ చేయనున్నారని కౌన్సిల్ నగర నాయకుడు నక్కా షాలేం రాజు తెలిపారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

కరప, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కరప పీహెచ్‌సీలో మంగళవారం పద్మారం అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెంకే సేవ కోశాధికారి వీరభద్రరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు పంపిణీ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్, రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని పండ్లు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీడీపీ నేత నులుకుర్తి వెంకటేశ్వరరావు, అలయన్స్ క్లబ్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన పార్టీల మండలాధ్యక్షులు దేవు వెంకన్న, బండారు మురళి, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ముద్రగడ రమేష్ తదితరులున్నారు.

దీన్‌దయాల్ వర్ధంతి

కరప, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘం పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం బీజేపీ నాయకులు నిర్వహించారు. ఉప్పలంక, నడకుదురు గ్రామాల్లో ఆయన చిత్రపటానికి బీజేపీ మండలాధ్యక్షులు రెడ్డి రమణేశ్వర్, యర్రంసీడి పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు రొంగల సన్యాసిరావు, చిటిమిరెడ్డి గోవిందు, శివశంకర్, తాతబాబు, పెమ్మాడి నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, బూత్ కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి ఉన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు గైగోలుపాడులో బీజేపీ మండలాధ్యక్షుడు నండూరి సత్తిబాబు, పాలిక శివ ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు పువ్వులు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.లీలావతి, బి.అజయ్, కండలి వెంకట్, కొయ్య సాయికుమార్, పాలిక ప్రకాశరావు, వంక లోవరాజు, మేడిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు లిబరేషన్ మద్దతు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 12న జరిగే మన్య ప్రాంత బంద్‌కు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు తెలిపారు. లిబరేషన్ పార్టీ కార్యాలయంవద్ద ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రిజర్వేషన్ ఫలాలందిస్తున్న జీవో నెంబరు.3ను సుప్రీంకోర్టు కొట్టివేస్తే జగన్, కూటమి నేతలు ఏమీ మాట్లాడలేదన్నారు. గిరిజన సమస్యలపై ఆదివాసీజేఏసీ పిలుపుమేరకు మన్యం బంద్‌ను విజయవంతం చేయాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రంపచోడవరం కూడలిలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

మన్యం బంద్ విజయవంతం

రంపచోడవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. ఈ మేరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల బంద్‌లో భాగంగా మంగళవారం మొదటిరోజు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలను స్వచ్ఛందంగా మూయించివేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పత్రిక ప్రకటన ద్వారా గిరిజన చట్టాలను రక్షిస్తామనడం సబబు కాదని, ఆదివాసీ చట్టాలను పటిష్టపరిచి ఆర్డినెన్స్ రూపంలో ఆదివాసీలకు తెలియపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, జి.సత్యనారాయణ, కె.అగ్గిదొర, ఏబీకేఎంఎస్ నాయకులు జనుపల్లి సత్తిబాబు, ఐవీ రమణ, పి.సోయమ్మ, గిరిజన సంఘం నాయకులు లోతా రామారావు, సీపీఎం నాయకులు బి.కిరణ్, శాంతిరాజు, మట్ల వాణిశ్రీ, సీఐటీయూ నాయకులు ఎ.రామకృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు ఎం.దుర్గాప్రసాద్, గుబ్బల ఆదినారాయణ, బి.బుజ్జిరెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకుడు మరుకుర్తి ఏసు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు బచ్చల శ్రీదేవి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్ విజయవంతమైంది. దుకాణాలను యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. బ్యాంకులు మూతపడ్డాయి. స్పీకర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు పెద్ద పెట్టున నినదించారు. రహదారిపైకి వచ్చి ఎటువంటి ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించరాదని సీఐ సన్యాసి నాయుడు ఆంక్షలు విధించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని ఒకానొక సమయంలో పోలీసులతో ఆదివాసీ నాయకులు వాగ్వాదానికి దిగారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు వంతు బాలకృష్ణ, కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, తాము సూరిబాబు, గంపా నాగరాజు, సింగిరెడ్డి అచ్చారావు, వజ్రపు అప్పారావు, బి.రామకృష్ణ, సీహెచ్ శివ, పి.పాపారావు, జె.దొరబాబు, కె.ప్రవీణ్, కె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల నాయకులు శాంతియుత వాతావరణంలో బంద్‌కు మద్దతు పలికారు. స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలంటూ అంబేడ్కర్ విగ్రహం నిరసన తెలిపారు. ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మండిగొంట వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు పుడిగి లక్ష్మణరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల బంద్ విజయవంతమైంది. దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడగా ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహనరావు, సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, కుంజా అనిల్, ఎంపీపీ రంగమ్మ, కొమరం పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఎటపాకలో బంద్ విజయవంతమైంది. ఆదివాసీ సంఘాల నాయకులు లక్ష్మీపురం జాతీయ రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, బ్యాంకులు, దుకాణాలను మూయించి వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): మన్యం బంద్ చింతూరులో సంపూర్ణంగా జరిగింది. ఆదివాసీ జేఏసీ నాయకులు జల్లి నరేష్, సీసం సురేష్, పండా కృష్ణయ్య, బొగ్గ ముత్తయ్య, సోడె నారాయణ, కాకా సీతారామయ్య, కుర్సం బ్రహ్మయ్య, సీపీఎం నాయకుడు పల్లపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





చింతూరు, వై.రామవరంల్లో ఆదివాసీ నేతల ఆందోళన



రాజవొమ్మంగిలో ....



ఎటపాక మండలం లక్ష్మీపురంలో



కూనవరంలో మూతపడిన ఎస్‌బీఐ

చంద్రబాబు జోక్యంతో సద్దుమణిగిన ఆదివాసీల ఆందోళన

పరిస్థితిని నివేదించిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్, మంత్రి సంధ్యారాణి

1/1970 చట్ట సవరణ యోచనే లేదన్న హామీతో ఉద్యమాన్ని నిలిపేసిన వైనం

రంపచోడవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా 1/1970 చట్ట సవరణ అంశాన్ని తీసుకుని ఆదివాసీ సంఘాలు సాగిస్తున్న ఉద్యమాలు, 48 గంటల బంద్ వంటి ఆందోళనలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యంతో మంగళవారం సాయంత్రం నుంచి సద్దుమణిగాయి. మంగళవారం తలపెట్టిన బంద్ తదితర ఆందోళనలపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, గిరిజన మంత్రి సంధ్యారాణి ప్రభుత్వానికి నివేదించడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. మొత్తం పరిస్థితిని ముఖ్యమంత్రికి ఆయన కార్యాలయం అధికారులు వివరించడంతో నేరుగా చంద్రబాబు రంగంలోకి దిగారు. గిరిజనుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ కూటమి ప్రభుత్వం తీసుకోదని, గిరిజనులకు గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలకు నూరు శాతం రిజర్వేషన్ల అమలుకు టీడీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.3ని పునరుద్ధరించే దిశగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగు న్యాయం కోసం ప్రయత్నిస్తున్న అంశాన్ని కూడా వివరించారు. ముఖ్యమంత్రి స్పష్టం చేసిన అంశాలను అల్లూరి కలెక్టరు దినేష్‌కుమార్ ఆదివాసీ జేఏసీ నేతలకు వివరించారు. 1/1970 చట్ట సవరణ లేదని ప్రభుత్వమే తేల్చి చెప్పడంతో బుధవారం నాటి ఆందోళనను వాయిదా వేస్తున్నట్టు ఆదివాసీ జేఏసీ తేల్చి చెప్పింది.

1/1970 చట్ట సవరణ యోచన ప్రభుత్వానికి లేదు

రంప ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల ఉద్ఘాటన

రంపచోడవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాల గిరిజనుల ప్రయోజనాల దృష్ట్యా 1/1970 చట్టాన్ని సవరించే యోచన ప్రభుత్వానికి లేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్ ఉద్ఘాటించారు. మంగళవారం వారు ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ గొర్లె సునీత కూడా స్పందించి 1/1970 చట్ట సవరణను టీడీపీ చేపట్టదన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'హైవేపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి'

గండేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీరాజాపురం వెళ్లే దారిలో హైస్కూల్ ఉంది. దీనికి గండేపల్లి నుంచి విద్యార్థులు వెళ్తుంటారు. ఆ స్కూల్‌కు వెళ్లేందుకు జాతీయరహదారి డివైడర్ దాటి వెళ్లాలి. జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. దీంతో విద్యార్థులు భయంగానే ఆ డివైడర్ దాటుకుని వెళ్తున్నారు. ఇక్కడ డివైడర్‌వద్ద సిగ్నల్ బోర్డు పెట్టలేదు. దీనిపై అధికారులు స్పందించి డివైడర్‌వద్ద హెచ్చరిక, ట్రాఫిక్ సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గండేపల్లిలో డివైడర్ దాటుతున్న విద్యార్థులు

'ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించుకుందాం'

జగ్గంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం జగ్గంపేటలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, విశాఖ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, ఎస్వీ ప్రసాద్, కోండ్రోతు శివ, నేదురి గణేష్, మండపాక వెంకటేశ్వరరావు, దాట్ల సుబ్బారాజు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

గండేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు అన్నారు. ఆయన మంగళవారం మండలంలో నీలాద్రిరావుపేట గ్రామ జాతీయరహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. హెల్మెట్లు ధరించని వాహనదారులకు ఫైన్ వేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు అనుసరించాలన్నారు.

'మామిడికి పూత, పిందె దశలో సస్యరక్షణ చేపట్టాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మామిడికి పూత, పిందె దశలో సస్యరక్షణ చేపట్టాలని ఏలేశ్వరం ఉద్యాన శాఖాధికారిణి ఎ.శ్రీవల్లి తెలిపారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగిల్లోని మామిడితోటలను ఆమె సందర్శించి మామిడి రైతులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం మామిడితోటలు పూత, పింది దశలో వీటి సస్యరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డు భద్రతపై గులాబీలతో అవగాహన

తొండంగి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ అధికారులు మంగళవారం వినూత్న రీతిలో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లా రవాణా అధికారి శ్రీధర్ ఆదేశాల మేరకు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ బెండపూడి శివారు పాతచెక్‌పోస్టువద్ద వాహనాలపై వెళ్లే వారికి అవగాహన కల్పించారు. సీటుబెల్ట్, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారికి గులాబీ పువ్వు ఇచ్చారు. సీటుబెల్టు ధరించి ప్రయాణించే వారికి ఫ్రూటీ డ్రింక్ అందించారు. కాకినాడ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు ఉన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడికి పరామర్శ

కిర్లంపూడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల యాదవ సంఘం అధ్యక్షుడు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నైదాన రఘు మోకాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయన్ను భారతీయ చైతన్య యువజన పార్టీ ప్రత్తిపాడు కన్వీనర్ గొంప శివకుమార్, దేవర శ్రీను, కోనగంగాధర్, రాజానగరం మండలం వడిశలేరు వైసీపీ నాయకులు యోగ క్షేమాలు అడిగి తెలుసున్నారు.

ఇర్రిపాకలో శివకేశవుల ప్రతిష్టకు ఏర్పాట్లు

జగ్గంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీతీరాన ఆలయంవద్ద శివకేశవులను ఒకేచోట ప్రతిష్ఠించేందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 12వతేదీ ఉదయం కాతేరు నుంచి భజన బృందాలు, మేళతాళాలతో ఊరేగింపుగా దివాన్‌చెరువు, మురారి, గండేపల్లి, మల్లేపల్లి జగ్గంపేట మీదుగా ఇర్రిపాకకు విగ్రహాలు చేరుకుంటాయి. 17న 11.55గంటలకు శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, బ్రహ్మకుమారీలు, అన్నం దేవుల చంటి, భూపాలపట్నంప్రసాద్, మారిశెట్టి రాధా, యర్రబత్తుల గోవిందనాయుడు, చినబాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చిత్రపటం అందజేస్తున్న బ్రహ్మకుమారీలు

రౌతులపూడిలో అందుబాటులోకి గుండెపోటు ఇంజక్షన్

రౌతులపూడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి ప్రభుత్వాస్పత్రిలో గుండెపోటు బాధితులకు అత్యవసరవైద్యం అందుబాటులో ఉందని స్టేమి నోడల్ అధికారిణి పి.పావని, డీడీవో జానకీదేవి అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో గుండెపోటు లక్షణాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో హబ్ అండ్‌స్పోక్ విధానంలో రూ.40వేల ఖరీదైన స్టేమి ఇంజక్షన్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. గుండెపోటుకు గురైన తొలి గంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

'రైతు భూమి వివరాలు నమోదు చేసుకోవాలి'

శంఖవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ భూమి వివరాలను ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో పొందుపరుచుకోవాలని రైతు సేవాకేంద్రంలో సిబ్బంది దీనికి సహకరిస్తారని వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. నెల్లిపూడిలో మంగళవారం రైతులతో సమావేశమయ్యారు. భూమి పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌తో లింక్ అయిన సెల్‌ఫోన్‌తో రైతుసేవా కేంద్రంలో సిబ్బందిని కలిస్తే వారు వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఆధార్‌తో ఫోన్ నెంబరు లింక్ కాకపోతే మీసేవా కేంద్రంలో లింక్ చేసుకోవాలని తెలిపారు.



నెల్లిపూడిలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

గొర్రెల పెంకందార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కేశవ



కేశవను అభినందిస్తున్న యనమల రాజేష్

తొండంగి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గొర్రెల పెంపకందార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన కొయ్యా రామకేశవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకుప్రతిష్టాత్మకమైన అధ్యక్ష పదవిని చేపట్టిన కేశవను టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు, కొయ్యా సూరిబాబు, పేకేటి దారకొండ, రాజబాబు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ గొర్రెల పెంపకందార్ల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవిని కేటాయించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీశ్

న్యూఢిల్లీ/కాకినాడసిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైందని రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీశ్ అన్నారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థ కుప్పకూలిందని, రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. మంగళవారం, రాజ్యసభలో ఆయన తొలిసారి మాట్లాడారు. 'లోక్‌సభలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పోలవరంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత సీఎం చంద్రబాబు గడిచిన 7 నెలల్లో ఐదు సార్లు పోలవరాన్ని సందర్శించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. సీఎం చంద్రబాబు హయాంలో పోలవరం పూర్తి అవుతుంది. గత ఐదేళ్లలో ఏపీకి రాజధానిని లేకుండా చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తారని వైసీపీ ఎంపీలు అసత్య ఆరోపణలుచేస్తున్నారు' అని సతీశ్ అన్నారు.

రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన గత వైసీపీ ప్రభుత్వం

లోక్‌సభలో కాకినాడ ఎంపీ ఉదయ్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్లక్ష్యం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో నవ్యాంధ్ర నిర్మాణానికి కృషి చేస్తోందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు, రైతులకు మేలు చేసేలా అనేక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం హయంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కేంద్రం జలజీవన్ మిషన్ ద్వారా రూ.16వేల కోట్లు మంజూరు చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేసి పథకాన్ని నిర్వీర్యం చేసింద న్నారు. ఏపీలో ఒకేరోజు 13326 గ్రామసభలు నిర్వహించడంతోపాటు, 30వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చేట్టి రికార్డు సృష్టించామని ఎంపీ పేర్కొన్నారు.

దీనదయాళ్ వర్ధంతి

ఏలేశ్వరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరంలో మంగళవారం బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ, స్వావలంబన కల, రాజకీయ వ్యవస్థలు గ్రామాభివృద్ధికి ప్రధాన ఆధారరమని భావించిన గొప్ప వ్యక్తి దీనదయాళ్ అన్నారు. కూరాకుల రాజా, గరిక నాగు, గొడుగు నల్లబ్బాయి, బండారు సూర్యనారాయణ, మలిరెడ్డి సూరచంద్ర, సత్తిబాబు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై జనసైనికులతో కలిసి పేదలకు అన్నం వడ్డించారు. ఈ క్యాంటీన్‌లో 400మందికి భోజనాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గేన శివ, అడబాల వీరబాబు, కె.కనకరాజు, మల్లేపల్లి గణేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ప్రమాదంలో గాయపడి కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్న ఓ వ్యక్తికి ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం రూ.5వేలు సహాయం అందించి చేయూతనందించారు.

ప్రతి ఓటు చెల్లుబాటయ్యేలా ఓటర్లను చైతన్యపరచాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు



కార్యకర్తలతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతి ఓటు చెల్లుబాటు అయ్యేలా ఓటర్లను చైతన్యపరచాలని కూటమి పార్టీల నాయకులకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సూచించారు. ఈ మేరకు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలతో సమీక్షించారు. ప్రతి 30 ఓట్లకు ఒక ఇన్‌చార్జ్‌ని నియామక పరిచి గెలుపు లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో టీడీపీ నాయకులు సొల్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, యినిగంటి సత్యనారాయణ, డాక్టర్ గంట్ల చిన్నారావు, బైలపూడి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కనుల పండువగా కుంతీమాధవుని రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో కుంతీమాధవుని రథోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఆలయం నుంచి మోసుకుంటూ ప్రదర్శనగా తీసుకువచ్చి రథం పై ఉంచారు. అనంతరం పురవీధులు గుండా రథాన్ని నడిపించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథం ఫైర్‌స్టేషన్, అంబేడ్కర్ సెంటర్, పాతబస్టాండు, సినిమా సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్‌కు చేరుకోగా రథంలో ఉన్న ఉత్సవ మూర్తులను భారీగా తరలివచ్చిన భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. భారీగా బాణ సంచా కాల్చారు. అంతకుముందు కుంతీ మాధవునికి విశేషపూజలు జరిగాయి. కార్యక్రమాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కుంతీమాధవ భక్తబృందం సభ్యులు, ఈవో నున్న శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.



పిఠాపురంలో కుంతీమాధవుని రథోత్సవం దృశ్యం